తన పెళ్ళి విషయంలో కన్నవారి జోక్యానికి తావులేదని అతను ఎలా చెప్పగలిగాడు?

డా॥ పి. సుబ్బారావ్ కథ

# చిరుగుతున్న పాత పేజీ

వసంతరావు భార్య కాత్యాయనితో హేమాపురంవచ్చి నాలుగురోజులయింది. ప్రతీరోజూ 'రేపు' 'రేపు' అంటూ తల్లితో ఎలా కదపాలో తెలియక గింజుకుంటున్నాడు. ప్రొద్దున్నా, సాయంకాలం విడమరచి, ఇంకా మీనమేషాలు లెక్కపెడతారెందుకు, అడగక?'' అని పదే పదే సలుపుతోంది కాత్యాయని. ఐదేళ్ళ తరువాత వచ్చిన ఒకే ఒక కొడుకికి అన్నీ అమర్చిపెట్టాలని శారదాంబ తాపత్రయం. వద్దని, అనవసరంగా హైరానాపడవద్దని చెబుదామని నోటివరకు వచ్చినా, తల్లిని నిరుత్సాహపరచడం ఇష్టంలేక ఊరుకున్నాడు. ఈవేళ తల్లి చేసిన పెరుగు వడలు ఎంత అద్భుతంగా ఉన్నాయో! బాగా కుదిరేయి. కాత్యాయని చేసిన పెరుగు వడలు ఎన్ని సంవత్సరాలు పెరుగులో ఉంచినా మెత్తపడవు, అనుకుంటూ చిన్న మగత నిద్రలోనికి జారేడు వసంతరావు.


వెంకట్రావు రైల్వేలో డ్యూటీచేసి అలసి కుర్చీలో చతికిలపడుతుంటే శారదాంబ,

''ఏమండోయ్! మనవాడికి ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది'' అంది సంతోషంగా.

''అహా! అలాగా!'' అన్నాడు వెంకట్రావ్ నిర్లిప్తంగా.

''అదేమిటే, అంతమంచి వార్త చెబితే అలా అహా! అన్నారేమిటి?'' అనడిగింది శారదాంబ.

''పిల్లలు బాగా చదువుతున్నారన్నా, వృద్ధిలోనికి వస్తున్నారన్నా ఆనందపడని తల్లిదండ్రులెవరు? కాని ఆలోచించు. కామాక్షి, నీరజల పెళ్ళిళ్ళకోసం మనం అనుకున్నదాని



కన్నా ఎక్కువ ఖర్చు అయింది. గ్రామంలో ఉన్న రెండెకరాల మీద తనఖా ఉంది. నా ప్రావిడెంట్ ఫండ్‌లోంచి అప్పుడే 15000 తీసేసుకున్నాను. ఇన్సూరెన్స్ పాలసీ డబ్బు పులుసులోనికి ముక్కలయిపోయింది. వీడి నాలుగేళ్ళ చదువుకి ఎంత లేదన్నా దాదాపు పదివేలు కావాలి. అంటే ప్రతి నెలా వీడికి 200 రూపాయలు పంపాలి.

నీకు తెలుసుగా నాకు వచ్చే జీతం! ఇది సాధ్యమయ్యే పనేనా? ఈ వచ్చిన సీటు రెండేళ్ళ క్రితం వచ్చి ఉంటే బాగుండేది. ఇప్పుడు రెండేళ్ళు వృధా. వాడిది బి.ఎస్‌సి అయింది కాబట్టి రైల్వేలో ఉద్యోగం చూసుకోవడం శ్రేయస్కరం, ఆలోచించు' నేను ఇంకొక ఆరేళ్ళలో రిటైర్ అవుతాను. అప్పటికి మనకి ఏదో ఆధారం ఉండాలిగా'' అని సమాధానం చెప్పాడు వెంకట్రావు.

ప్రక్క గదిలో ఈ మాటలన్నీ వింటున్న వసంతరావుకి ఒక్కసారి భయం కలిగింది. కొంపతీసి ఇంజనీరింగ్ చదివించరేమిటి? అని గతుక్కుమన్నాడు.

తెల్లవారి తండ్రి లైనుమీదకి వెళ్ళేక తల్లితో, 'ఇంజనీరింగ్ అయితే మంచి ఉద్యోగం వస్తుంది, మీ సంగతి నేను చూడనేమిటి?'' అని వాదించి, తల్లిని తండ్రితో చెప్పమని ప్రాధేయపడ్డాడు.

''శారూ, వీడి చదువు అయి, నేను రిటైర్ అయేనాటికి మనకి అంటూ ఏమీ మిగలకపోవచ్చు. ఇది చెప్పు వాడికి'', అని ఇంజనీరింగ్‌లో చేర్పించేడు తండ్రి. అలాంటి నమ్మిన తండ్రికి తను చేసిందేమిటి? తలకి ఇంత కొరివి పెట్టాడు? ఇంజనీరింగ్ అయేక ఒక సంవత్సరం పట్టింది ఉద్యోగం రావడానికి, కలకత్తా చేరేక తను సరిగ్గా డబ్బు రెండేళ్ళు పంపేడేమో! పెళ్ళి, కాత్యాయనితో తిరుగుడు, సరదాలకి డబ్బు చాలక, వాళ్ళకి పంపే డబ్బు తగ్గుతూ వచ్చి ఆఖరికి ఆగిపోయింది. ప్రావిడెంట్ ఫండ్‌తో తనఖా విడిపించుకుని స్వంత ఇంటిలో స్థిరపడ్డారు తల్లితండ్రులు. ఆఖరుసారి తండ్రికి ఒంట్లో బాగుండడంలేదంటే తను ఒక్కడూ వెళ్ళాడు. మానధనుడు తన తండ్రి! పల్లెత్తు మాట తనని అనలేదు ఎప్పుడూ. కానీ, నీమీద అంత నమ్మకం ఉంచి చదివించినందుకు ఇదా నువ్వు చేసినది?'' అన్నట్లుగా ఉన్న ఒకే ఒక చూపుని తను ఎన్నటికీ మరిచిపోలేదు. అది అలా కాలుస్తూనే ఉంది. నిజమే! అర్జనపరుడయేక తను వాళ్ళని వాళ్ళ మానాన వదిలేసాడు. ఒక్కసారి తెలివి వచ్చింది వసంతరావుకి. చుట్టూ చూస్తే తల్లి మధ్యాహ్నం ఫలహారంకి కాబోలు ఏదో అవస్థ పడుతుంది. ఎక్కడా కాత్యాయని అలికిడి లేదు. ఇంతకన్నా మంచి సమయం దొరకదని తల్లిని సమీపించి ''అమ్మా, ఒక్కర్తెవీ ఎన్నాళ్ళు ఇలా ఇక్కడ బ్రతుకుతావు? మాతో వచ్చేయకూడదు'' అవడిగేడు తల్లి ప్రక్కన కూర్చుంటూ. ఒక్కసారి కళ్ళద్దాల్లోంచి కొడుకువేపు పరిశీలనగా చూసింది 68 ఏళ్ళ శారదాంబ.

''నాయనా, నా జీవితం ఇక్కడ వెళ్ళిపోవాల్సిందే. ఇక్కడ ఉంటే నాకు తృప్తి. పట్నంలో బ్రతకలేను. అదీకాక ఈ ఇల్లు?'' అనడిగింది శారదాంబ.

''అమ్మేద్దాం'' అన్నాడు వసంతరావు చటుక్కున.

''ఈ ఇల్లు అమ్మే ప్రసక్తి ఎప్పుడూ తీసుకురావద్దు. నేను వెళ్ళిపోయేక అలాంటి పని చేసుకో'' అని కంటిలో తిరిగిన నీటిని పైట చెంగుతో ఒత్తుకుంది. ఒక్క క్షణం ఆగి, ''నా గురించి నువ్వేమీ బెంగపడకు. ఇది నాకు కొత్తేమీకాదుగా. ఆ పొలం నుంచి నాలుగు బస్తాలు బియ్యం ఇస్తాడు రైతు.

ఇంటి వెనకాతల పొదులలోంచి కూరగాయలు వస్తాయి. ఆవు ఉండనే వుంది, చాలు నాకు, జరగనప్పుడు నీకు కబురు పంపుతాలే'' అంది తల్లి దెప్పిపొడవాలనుకోక పోయినా, ఆ మాటలు, తన జీవితంలో తప్పటడుగుని వేలెత్తి చూపించినట్లయి సిగ్గుతో తలవంచుకున్నాడు.

''ఒక కప్పు కాఫీ ఇయ్యమ్మా'' అవడిగేదు కాస్త బొంగురు గొంతుకతో.

శారదాంబ లేచి వెళ్ళి కాఫీ కలిపి తెచ్చి ఇచ్చింది. వరండాలోకొచ్చి తిరిగి కుర్చీలో చతికిలపడి కాఫీ త్రాగుతుంటే కాత్యాయని వచ్చి పలకరించింది మెల్లిగా, 'కదిపేరా?' అని.

''లాభం లేదు. ఇల్లు అమ్మడం సాధ్యం కాదు'' అని సమాధానం చెప్పి మొహాన్ని రెండవవైపు తిప్పుకున్నాడు.

***


ఉన్నట్టుండి రాఘవయ్యరాక ఇంట్లో అందరినీ ఆశ్చర్యపరిచింది. తండ్రి చనిపోయేక రెండేళ్ళ తరువాత వచ్చిన రాఘవయ్యని అన్నలు లక్ష్మయ్య, తిరుపతయ్యలు కుశలమడిగేరు. భోజనాలు అవీ అయాక ఆరుబయట అందరూ చతికిలపడి పిచ్చాపాటిలో పడ్డారు. తిరుపతయ్య పొగాకుతీపి శుభ్రంచేసి చుట్టగా చుట్టి, అగ్గిపుల్లెట్టి అంటించి , బలంగా రెండు దమ్ములు పీల్చి, రాఘవయ్యవేపు తిరిగి,

''నీ కొడుకుది ఇంటర్మీడియట్ అయిపోయిందేమిటి?'' అవడిగేదు.

''ఆ! ఫస్ట్‌క్లాస్‌లో పాసయేడు. కాని మన రాష్ట్రంలో మెడిసన్ సీటు రాలేదు. కర్నాటకలో వచ్చింది, చేర్పించాలి'' అని సమాధానం చెప్పేడు రాఘవయ్య. ఎవరూ మాటాడలేదు.

''మీరు పట్నంలో స్థిరపడ్డందుకు చదువులు బాగావే ఉన్నాయి'' అంది పెద్ద వదిన.

మళ్ళీ నిశ్శబ్దం. అందరూ తననే గమని



ంచడం చూసి బెరుకుగా ఉంది రాఘవయ్యకి. గొంతుకలో ఏదో అడ్డుపడినట్లుంది, నోట మాటలు స్పష్టంగా రావడంలేదు. అయినా తమాయించుకుని మెల్లిగా,

"వాడిని మెడిసన్ చదివించాలంటే చాలా డబ్బు కావాలి. నా వంతు వాటా అమ్మకానికి పెడదామని ఉంది. ఆస్థి పంపకాలు అవలేదని..." అని నసిగేడు.

"బాగుందండీ, ఇన్నాళ్ళు కనపడని ఆస్థి, గబుక్కున ఇప్పుడు అగపడిందేమిటి?" అనడిగింది చిన్న వదిన.

"ఉండండెహె! అనవసరంగా మీరు కలగచేసుకోకండి" అని కసిరేడు చిన్నన్న చలమయ్య.

"అదేంమాట, ఆళ్ళనీ చెప్పనీయ్!" అన్నాడు తిరపతయ్య. ఎవరూ మాటాడలేదు.

"నువ్వు పల్లె వదిలి పట్నం చదువుకి వెళ్ళినప్పుడు 12 ఎకరాల పొలం ఉండేది. నీ చదువుకి దానిమీద అప్పు తెచ్చేం. ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకి అదే ఆధరువు అయింది. మేము దానినే నమ్ముకుని సమిష్టిగా బ్రతుకుతూ 18 ఎకరాలు చేసేం. నువ్వెళ్ళిపోయి ఇన్నాళ్ళు దీని సంగతి పట్టించుకోకుండా పోవడంతో దీనిమీద నీకు ఆశలేదన్న నిర్ధారణకి వచ్చేం. మాకూ పిల్లా పాపా ఉన్నారు. చదువులకి, పెళ్ళిళ్ళకి డబ్బు అవసరం అవుతుంది. ఇప్పుడు నువ్వొచ్చి ఆస్థిలో వాటా కావాలంటే ఎలా పంచడం?" అన్నాడు తిరుపతయ్య ఆరిపోయిన చుట్టని తిరిగి వెలిగిస్తూ.

ఏదో చెబ్దామని ప్రారంభించబోయి ఆగేడు రాఘవయ్య.

***

"ఒరేయ్ శ్రీధర్, ఇంజనీరింగ్ కాలేజీకి ఫీజు కట్టే ఆఖరు తేదీ ఏమిటి?" అనడిగేడు వసంతరావు కొడుకుని. డైనింగ్ టేబుల్ మీద కూర్చుని బెండకాయల్ని తరుగుతున్న కాత్యాయని సంభాషణ వినాలని తరగడం ఆపింది.

"ఈ నెలాఖరువరకూ గడువు ఉంది. డబ్బు జతపడిందా?" అనడిగేడు శ్రీధర్.

కొడుకు ఆశగా అలా అడగడం వసంతరావుని కదిల్చింది. పేపరులో తల దూరుస్తూ "చూస్తున్నాను శ్రీధర్" అని మాత్రం అనగలిగేడు.

పదిరోజులు గడిచేయి.

"రేపే ఆఖరిరోజు నాన్నా, ఫీజు డబ్బు ఇస్తే బేంక్‌కివెళ్ళి డ్రాఫ్ట్ తెస్తాను" అన్నాడు శ్రీధర్.

"శ్రీధర్, నీకు ఎలా చెప్పాలో తెలియడంలేదు. పైకం సర్దుబాటు కాలేదు. ఇంజనీరింగ్‌లో పెట్టి నిన్ను చదివించడానికి ఎంతలేదన్నా సంవత్సరానికి 12000 కావాలి. అంటే వెరసి మొత్తం లక్ష రూపాయలు అవసరం. ఎక్కడ నుంచి వచ్చినా, ఇది నా తలకి మించినపని మన ఊరువెళ్ళి పొలం, ఇల్లు అమ్మితే ఈ డబ్బు వస్తుంది. కాని మా అమ్మ అందుకు సుముఖంగాలేదు. చాలాకాలంగా అమ్మ అక్కడ ఉండడానికి అలవాటుపడింది. ఆ ఆధరువు లేకుండా చేసి, ఈ వయస్సులో ఆమెని కష్టపెట్టడం

నాకు సాధ్యం కాదు. అందుచేత ఇక్కడే కాలేజీలో చేరు'' అని శ్రీధర్‌వైపు చూశాడు.

"నాన్నా మీకు తెలుసు ఇంజనీరింగ్ చదువుకు ఉన్న విలువ. చాలా మట్టుకు నా భవిష్యత్తుకు ఇది పెట్టుబడి నాన్నా. మీరు ప్రావిడెంట్ ఫండ్ మంచి అప్పుతెచ్చుకోవచ్చేమో!''

"తెచ్చుకోవచ్చు. నేను రెండు ఉద్యోగాలు మారడంవలన అందులో ఎక్కువలేదు. ఏదో మతలబు చేసి తీస్తావనుకో, నీ చదువు అయేసరికి ఆ డబ్బు అయిపోతుంది, నేను రిటైరయ్యే రోజులు మరీ అంత దూరంలేవు మహావస్తే ఏడెనిమిది వందలు పెన్షన్ డబ్బులు వస్తాయి, దానితో బ్రతుకు వెళ్తుందా?'' అని విశదపరిచేడు వసంతరావు.

"నాన్నా ఇంజనీరింగ్ అయితే మంచి ఉద్యోగం వస్తుంది. మీరు నాదగ్గర ఉంటారు. మీ బరువు బాధ్యతలు నేను చూస్తాను'' అని హామీ ఇవ్వబోయాడు శ్రీధర్.

వసంతరావు ఏమి సమాధానం వెంటనే చెప్పలేదు. తల్లి ఏమైనా చెబుతుందేమోనని ఎదురు చూసాడు శ్రీధర్. కాని కాత్యాయని ఏమీ కల్పించుకోలేదు.

"వద్దురా! ఆ పాత దారినే వెళ్ళడం నాకిష్టంలేదు. ఇంకేదైనా మార్గం ఉంటే చూడు. డొనేషన్ కట్టి చదివించలేను. నాకు చేతనయినది చదివిస్తాను. ఇక్కడే డిగ్రీలో చేరు'' అని శ్రీధర్ ఆశని త్రుంచేసి, కొడుకు మొహం చూడడానికి ఇష్టంలేక గదిలోనికి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. కళ్ళలో నీరు సుడులు తిరిగి చెక్కిళ్ళమీదనుంచి జారుతుంటే దిగాలుగా తల్లికెదురుగా కుర్చీలో చతికిలపడ్డాడు శ్రీధర్.

* * *

"హాయ్ డేడ్! ఏమంటారు మీవాళ్ళు? ఎంత తీసుకువచ్చేవు? తొందరగా తేల్చకపోతే ఆ సీట్లు అమ్ముడయిపోతాయి'' అన్నాడు రమణ రాఘవయ్యతో.



## ఈత

ఇద్దరు ప్రేమికులు బోట్‌లో షికారు చేస్తున్నారు. ప్రసాద్ అన్నాడు రాధతో—

"రాధా! అనుకోకుండా ఇప్పుడు పడవ మునిగిపోతే ఏం చేస్తావు?''

"నీకు ఈత వచ్చుగా?'' అంది రాధ.

"అబ్బే నాకు ఈత రాదు'' చెప్పాడు.

"అయితే నేనే ఈదుకుంటూ పోతాములే'' అంది రాధ.

—గీతాంజలి (కొత్తగూడెం)

''లేదురా, ఏమీ తేలేదు. కష్టాలుపడ్డది వాళ్ళు. వదిలివచ్చిన వాడిని నేను. నైతికంగా ఆ ఆస్థిలో నాకు భాగం లేదురా'' అని సమాధానం చెప్పేదు రాఘవయ్య.

''వాటీజ్ ఇట్ డేడ్. బి.సి నాటి మనిషిలాగ మాట్లాడుతున్నావు. సెంటిమెంట్ అంటూ మడికట్టుకు కూర్చుంటే అంతా నష్టమే. ''సూ టెయ్'' డేడీ. కోర్టులో దావా వెయ్యి'' అన్నాడు రమణ.

గతుక్కుమన్నాడు రాఘవయ్య. కాలమహిమ కాకపోతే 18 ఏళ్ళ కొడుకు ఇలాంటి వాటిలో తండ్రికి సలహా ఇవ్వడమేమిటి? అదీ, అన్నలమీద ఆస్తికోసం దావా వెయ్యమని చెబుతాడా?

''లేదురా, అది జరగని పని. ఆ వేలం సంగతి మరచిపో'' అన్నాడు గొంతు పెగల్చుకుని.

''అయితే డేడ్ నా మెడిసన్ మాటేమిటి? బెంగుళూరు కాలేజీ మంచిది డేడ్. అక్కడ చదువుకున్న వాళ్ళు చాలామంది అమెరికా వెళ్ళిపోయారు. డేడ్, మరి లక్ష రూపాయలు డొనేషన్ ఎక్కడనుంచి తెస్తావు?'' అని ప్రశ్నించాడు రమణ.

కొడుకువేపు తేరిపార చూశాడు రాఘవయ్య. 21వ శతాబ్దపు ప్రతినిధి రమణ ముందు, తన తరం, ఆలోచనలు వెలవెలా పోతున్నాయి. వీడికి సెంటిమెంట్లు పనికిరావు. వీళ్ళ ధోరణే వేరు. అంతా బిజినెస్ ధోరణే. ఉన్నదంతా ఊడ్చి వీడి మీద లక్షన్నర పెట్టుబడి పెడితే రేపు వీడు రెక్కలు వచ్చేక ఎగిరిపోతాడు. తను, ఏదో కథలో చెప్పినట్లు, ముదటికి వస్తాడు, ముసలితనంలో తనకి ఏమీ ఉండదు ఆసరాకి, అనుకుని నిట్టూర్చి.

''నేను చెప్పినది జాగ్రత్తగా విను. మూడు మార్గాలున్నాయి. ఒకటి దావావేసి వచ్చిన డబ్బు మిగతా డబ్బు అంతా కలిపి నిన్ను మెడిసన్ చదివించడం, రెండు పల్లెలో ఉన్న ఆస్తి సంగతి పూర్తిగా మరిచిపోయి, మెడిసన్‌కి వెళ్ళకుండా ఇక్కడే డిగ్రీ చదవడం, మూడు నీ మెడిసన్ డొనేషన్‌కి, ఇతర పెద్ద మొత్తంకి అప్పు తీసుకురావడం. ఆ అప్పు నీ పేరనే ఉంటుంది. అది తీర్చే భారం నీదే. మొదటిది నాకు సుతరామూ ఇష్టంలేదు. మిగతా రెండింటిలో ఏది నీకిష్టమో చెప్పు'' అని ఆగాడు రాఘవయ్య

సమాధానం చెప్పకుండా, తీక్షణంగా తండ్రివేపు ఒక్క క్షణం చూసి చలువ కళ్ళద్దాలు సవరించుకుని మోటారుసైకిల్ కిక్ కొట్టాడు రమణ.

***

శ్రీధర్ డిగ్రీ పాసయి ఒక సంవత్సరమయింది. పేపర్లలోపడ్డ ప్రకటనలకి అప్లికేషన్లు పంపినా ఎక్కడా ఉద్యోగం రాలేదు. ఇంజనీరింగ్‌కి వెళ్ళలేకపోయినా దగ్గరనుంచీ శ్రీధర్‌లో మార్పు వచ్చింది. డబ్బులవసరం వచ్చినా తండ్రిని తిన్నగా అడగడు, తల్లి కాత్యాయని దగ్గర అడిగి తీసుకెళ్తాడు. ఒకరోజు

''నాన్నా, ఈ ఉద్యోగాల కోసం తిరిగి విసుగెత్తాను. లాభంలేదు, నాలాంటి గ్రాడ్యుయేట్‌లు చాలామంది ఉన్నారు'' అన్నా

దు శ్రీధర్ సంభాషణకి నాందిగా. పేపరు చదువుతున్న వసంతరావు పేపర్‌ని ప్రక్కకి పెట్టి కొడుకువేపు చూసేడు.

"నాకు 20 వేలు కావాలి. ఓ స్నేహితునితో కలిసి చిన్న వ్యాపారం చేద్దామని ఉంది. దానిని మీరు అప్పుగా ఇస్తే చాలు. నా కాళ్ళ మీద నేను నిలబడతాను" అన్నాడు.

ఒక్కసారి కత్తితో పొడిచినట్లనిపించింది వసంతరావుకి.

"అదేమిటి శ్రీధర్, అప్పు అని అంటావేమిటి? 20 వేలు నేను నీకు ఇవ్వకూడదా? ఏం బిజినెస్ ఏమిటి?" అనడిగేడు వసంతరావు.

"రొయ్యల ఎగుమతికి ఏజెన్సీ ఉంది. ఇక్కడ సరుకుని బొంబాయికి పంపడం, అంతే"

"రొయ్యలా? ఛ! అదేమిటి మనం ఎప్పుడైనా ఇలాంటివి చేసేమా?" అనడిగేదు వసంతరావు విముఖతని మొహంలో ప్రస్ఫుటింపచేస్తూ.

"నాన్నా, ఆనాడు ఇంజనీరింగ్ చదువుకి ఖర్చు ఎక్కువని చదివించలేదు. నేను మిమ్మల్ని ఆదుకుంటానని చెప్పినా ఎందువల్లనో మీకు నామీద నమ్మకం కుదరక, అంత పెట్టుబడి ఎందుకని మానుకున్నారు. మీ విద్యుక్తధర్మంగా నన్ను డిగ్రీ వరకు చదివించేరు. ఇప్పుడు ఉద్యోగాలు లేవు. ఏదో అవకాశం వచ్చింది. మీరు ఈ 20 వేలు నాకు వడ్డీకి ఇప్పిస్తే, త్వరలో నా కాళ్ళమీద నేను నిలబడతాను. మీకూ బరువు, బాధ్యతలు తగ్గుతాయి. ఇహ రొయ్యల వ్యాపారం మన పూర్వీకులు చెయ్యలేదనటం గురించి ఇదివరలో తన పిల్లల కంటే తన బాగోగులే ముఖ్యమని ఏ తండ్రైనా తలచేడా?... ధరణి మారింది నాన్నా" అన్నాడు గద్గదస్వరంతో.

"కానీ...." అని ఆగిపోయి, "రేపు సాయంకాలం డబ్బు తెస్తాను" అన్నాడు వసంతరావు.



# తలనొప్పులు

నిత్యజీవితంలో మనం అనుభవించే అనేక రకాల టెన్షన్స్ మనల్ని డాక్టర్స్ దగ్గరకు పరుగెత్తేలా చేస్తాయి. కొంతమంది పేషెంట్స్‌కి వచ్చే అధిక తలనెప్పులు డాక్టర్స్ ఇచ్చే మందులవల్ల తగ్గవు. వాళ్ళకు కణతలు మసాజ్ చేసేలాటి కృత్రిమ పద్ధతులవల్లనే తగ్గాలి. ఇలాంటి పద్ధతులవల్ల తలనెప్పులు తగ్గేవాళ్ళ సంఖ్య 42 శాతం వుంటుంది. చదువు కారణంగా తలనెప్పులు వచ్చే మరికొంతమంది తలనొప్పులు అంత త్వరగా తగ్గవు. న్యూయార్క్‌లోని స్టేట్ యూనివర్శిటీకి చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ ఎడ్వర్డ్ బి.బ్లానచర్డ్ — మందుల అవసరం లేకుండా విశ్రాంతివల్ల, కొన్ని ఎక్సర్‌సైజెస్‌వల్ల తలనొప్పులు సులభంగా తగ్గించుకోవచ్చని చెబుతున్నాడు.

—ఆడపా చిరంజీవి

"నీ డబ్బు కేమీ భయంలేదునాన్నా, త్వరలోనే తీర్చేస్తాను" అని బయటకి వెళ్తున్న శ్రీధర్‌ని బాధగా చూసేడు వసంతరావు.

***

"మూడు సంవత్సరాల క్రితం మెడిసన్‌లో చేర్పించడానికి వచ్చిన డిస్కషన్‌లో నువ్వు, 'అప్పు తెస్తాను కాని అది నీ పేరనే ఉంటుంది, అది తీర్చే భారం నీది' అన్నావు, జ్ఞాపకం ఉందా డేడ్?' అనడిగేడు రమణ.

"ఏం, ఎందుకని?" అని రాఘవయ్య కళ్ళద్దాలు సవరించుకున్నాడు.

"డేడ్, ఆసిల్‌మెట్ట జంక్షన్‌లో ఒక లాండ్రి షాపు ఉంది. వాడు అమ్మేస్తాడట. నేను అక్కడ స్టీమ్‌లాండ్రి పెడదామనుకుంటున్నాను. ఒక ప్రెస్, రెండు వాషింగ్ మెషీన్లు మూడు. అంతా కలిపి నా వాటా క్రింద 60 వేలు పెట్టుబడి. డేడ్ ఐవాంట్ దట్ మనీ. నువ్వు గతంలో అన్నట్లు అది తీర్చే బాధ్యత అంతా నాదే. కెన్‌యు హెల్ప్‌మి?" అనడిగేడు రమణ.

"ఒరేయ్ ! ఎక్కడ మెడిసన్, ఎక్కడి చాకలి దుకాణం! పరువు పోతుందిరా" అన్నాడు నీరసంగా రాఘవయ్య.

"దటీజ్ ఆల్ యక్, అప్పుడు నే చెప్పేగా సెంటిమెంట్ ప్రతీదానికీ అంటించుకుని మనకున్న అవకాశాలు వదులుకుంటున్నాం అని. చెప్పుడాడీ ఆ డబ్బు ఎరేంజ్ చేస్తానని" అన్నాడు రమణ ప్రాధేయపూర్వకంగా.

"ఒక వారం రోజులు పడుతుంది"

"థాంక్స్ డేడీ" అని రెబాన్ కళ్ళద్దాలని సవరించుకుంటూ మోటారుసైకిల్‌వైపు నడిచాడు రమణ.

***

ఉడా పార్క్‌లో బీచిలో సముద్రపు వొడ్డున శ్రీధర్, జలజలు కబుర్లు చెప్పుకుంటున్నారు. చీకటి పడబోతుంది. అప్పుడే వెలిగించిన లైట్ల వెలుతురో జలజ మతాబాలా వెలిగిపోతోంది. జలజ ముంగురులు గాలికి అల్లల్లాడుతున్నాయి. తెల్ల రుమాలుని బొడ్డుదగ్గర చీరలో దోపి, సుతారంగా చీరకుచ్చెళ్ళని జాగ్రత్తగా అమర్చుకుని, ఒదిగి కూర్చున్న జలజని పరీక్షగా చూసి, దగ్గరగా వచ్చి వాసన చూసేడు శ్రీధర్.

"ఏమిటీ అలా వాసన చూస్తున్నావు?" అనడిగింది జలజ.

"ఏం లేదు, ఈ మల్లెపువ్వు వాసన ఎలా ఉంటుందా?" అని కొంటెగా సమాధానం చెప్పాడు శ్రీధర్.

కిసుక్కున నవ్వింది జలజ.

"ఇంకొక రెండు నెలలలో చదువు పూర్తయి ఇంటికి వెళ్ళిపోతాను. తరువాత కథ మామూలే, పెళ్ళివగైరా" అంది క్రీగంట శ్రీధర్‌ని చూస్తూ.

మన్మధ బాణం ఎక్కడ తగలాలో అక్కడే తగిలింది.

"ఈ వేళ ఇంట్లో చెప్పేస్తాను. రిజిస్ట్రార్ ఆఫీసులో 15 రోజుల్లో పెళ్ళిచేసుకుందా

ం. మీ వాళ్ళకి రాయి ఈ సంగతి'' అన్నాడు శ్రీధర్.

''మీ వాళ్ళు ఒప్పుకోకపోతే?'' అనడిగింది జలజ.

''ఎందుకు ఒప్పుకోరు? ఇదివరలో తల్లి దండ్రులు తమకున్న సర్వస్వాన్ని పిల్లలకిచ్చి, చదువు చెప్పించేక, ముసలి తనంలో పిల్లలమీద ఆధారపడేవారు. చదువుల్లో, పిల్లల పెళ్ళిళ్ళ విషయాలలో పెద్దరికం తీసుకునేవారు. నైతికంగా ఆ హక్కు వాళ్ళకి ఉందనిపించేది. తన తల్లి దండ్రులని వదిలేసినట్టు, నేమా తనని వదిలేస్తానేమోనని భయపడ్డాడు నా తండ్రి. ఇది పొరపాటు కాదు వివాదాస్పదం. ఏది ఏమైనా అది ఆనవాయితీ సంకెళ్ళను త్రెంచింది. నిన్ను పెళ్ళి చేసుకోవడానికి వాళ్ళకి ఏమీ అభ్యంతరం ఉండకూడదు'' అన్నాడు శ్రీధర్.

గోముగా శ్రీధర్ కళ్ళలోనికి చూసి, జుత్తుని వెనకి విదిలిస్తూ, మరోసారి కిసుక్కున నవ్వింది జలజ.

ఉదయిస్తున్న చంద్రుని కాంతిలో జలజ పలు వరస మెరిసింది.

*

